# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ డెన్మార్క్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

- ❖ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా దేశ పౌరుల హక్కులను కాపాడతామని మైనారిటీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలియజేశారు.

- ❖ రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

- ❖ కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) ఈరోజు చార్జిషీట్ దాఖలు చేసింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడెరిక్సెన్‌తో ఫోన్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నాయకులు భారతదేశం - డెన్మార్క్ హరిత వ్యూహాత్మక భాగస్వామ్యానికి తమ బలమైన మద్దతును పునరుద్ఘాటించారు. రెండు దేశాల ప్రయోజనం కోసం పలు రంగాలలో సహకారాన్ని పెంచుకోవడంపై చర్చించారు. 2020లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రారంభించినప్పటి నుండి ఉన్నత స్థాయి సంప్రదింపులు జరుగుతున్నాయని భారతదేశంలో డెన్మార్క్ పెట్టుబడులు హరిత పరివర్తనకు దోహదపడటానికి అనుకూలమైన పరిస్థితులను సృష్టించిన వివిధ రంగాలలో తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

==========================

వక్ఫ్ సవరణ చట్టం ద్వారా దేశంలోని ఏ ఒక్క పౌరుడి భూమిని ఎవరూ అక్రమంగా లాక్కోకుండా నిరోధించడం కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగమని మైనారిటీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలియజేశారు. కొచ్చిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, వక్ఫ్ సవరణ చట్టం ఏ సమాజాన్ని లక్ష్యంగా చేసుకోవడం లేదని, అనేక ముస్లిం సంస్థలు ఈ చట్టానికి మద్దతు నిచ్చాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

దేశంలోని చాలా ప్రాంతాలలో రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఈ దఫా మొత్తం వర్షాకాలం సీజన్‌లో 'ఎల్ నినో' తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశమే లేదని స్పష్టం చేసింది. న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ వివరాలను ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు 4 నెలల పాటు వర్షాకాలం ఉంటుందని.. ఈ వ్యవధిలో దీర్ఘకాలిక వర్షపాత సగటు 87 సెంటీమీటర్లగా ఉంటుందని, ఇందులో దాదాపు 105 శాతం మేర సగటు వర్షపాతం ఈ సారి కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఎల్ నినో తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడితే వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడతాయని.. ఈసారి భారత్‌లో ఆ తరహా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపించడం లేదని మృత్యుంజయ్ మోహపాత్ర వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఇదిలా ఉండగా వడగాల్పులు మాత్రం గత సంవత్సరంతో పోలిస్తే వచ్చే జూన్ నుండి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భూశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ తెలిపారు.

(వాయిస్ 18 సెకన్లు)

విరామం

========================

వక్ఫ్ సవరణ చట్టంపై ముర్షిదాబాద్ లో జరిగిన హింసాకాండ పై జోక్యం చేసుకోవాలని పశ్చిమ బెంగాల్ భారతీయ జనతా పార్టీ విభాగం ఆ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ సి.వి. ఆనంద బోస్‌ను కోరింది. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని కోరుతూ శశాంక్ శేఖర్ ఝా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఇదిలా ఉండగా బి.ఎస్.ఎఫ్. అదనపు డైరెక్టర్ జనరల్ ఎడిజి రవి గాంధీ నిన్న ముర్షిదాబాద్‌లోని సంషేర్‌గంజ్‌ను సందర్శించి ఆ రాష్ట్ర డిజిపి రాజీవ్ కుమార్, దక్షిణ బెంగాల్ ఎడిజి సుప్రతిమ్ సర్కార్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. హింస ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను నెలకొల్పడానికి బి.ఎస్.ఎఫ్, పోలీసులు సంయుక్తంగా పని చేస్తారని ఎడిజి తెలిపారు.

========================

నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను చేర్చుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌లో కాంగ్రెస్ ఓవర్సీస్ చీఫ్ సామ్ పిట్రోడా, సుమన్ దూబేతో పాటూ మరికొంత మంది పేర్లను కూడా చేర్చింది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ కేసును తదుపరి విచారణ కోసం ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. కాగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద మనీలాండరింగ్ నేరానికి సంబంధించి ఈ ఛార్జిషీట్ దాఖలు చేయబడింది.

==========================

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఈరోజుతో 75 వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ వజ్రోత్సవ వేడుకల పైలాన్‌ను ఆకాశవాణి వార్తా సేవల విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రజ్ఞా పలివాల్ గౌర్ ఈరోజు వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ సిబ్బందిని ఉద్దేశించి డాక్టర్ ప్రజ్ఞా పలివాల్ గౌర్ మాట్లాడుతూ... ప్రసార సాంకేతికత అనలాగ్ నుండి డిజిటల్ ట్రాన్స్మిటర్లకు మారడంతో ప్రసార సామర్థ్యాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఇంటర్నెట్ టెక్నాలజీని స్వీకరించడంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారాలు మరింత విస్తరించాయని, దీంతో వివిధ ఛానెళ్ల ప్రత్యక్ష ప్రసారాలు కూడా సాధ్యమయ్యాయన్నారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం విజయవంతంగా ప్రసారాలు అందించడంతో నిజమైన సమ్మిళత్వం సాధించిందని డాక్టర్ ప్రజ్ఞా పలివాల్ గౌర్ శుభాకాంక్షలు తెలిపారు.

(వాయిస్ 43 సెకన్లు)

==========================

తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీని ఏర్పాటు చేసింది. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫారసు చేయనుంది. కమిటీ ఏర్పాటుని ఆ రాష్ట్ర కాంగ్రెస్ కూడా స్వాగతించింది. ఇటీవల ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి తమిళనాడు ప్రభుత్వం మధ్య వివాదాలు నెలకొన్న వేళ ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొద్ది రోజుల క్రితం పెండింగ్ బిల్లుల ఆమోదంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టుని ఆశ్రయించగా.. పెండింగులో పెట్టిన 10 బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని న్యాయస్థానం స్పష్టంచేసిన నేపథ్యంలో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 75 వేల 157 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 1,577 పాయింట్ల లాభంతో 76 వేల 734 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 500 పాయింట్లు లాభపడి 23 వేల 328 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.77గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3 వేల 242 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

==========================
==========================